



ఆసక్తి చూపని పట్టభద్రులు

- ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోని విద్యావంతులు
- 10 లక్షల మందికి 3.58 లక్షల మంది దరఖాస్తు
- 6తో ముగిసిన గడువు
- 23న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఓటు హక్కు కోసం పేర్లు నమోదు చేసుకోవడంలో, ఆ హక్కును వినియోగించుకోవడంలో చదువుకున్న వారికంటే గ్రామీణ ప్రాంత సాధారణ పౌరులే మిన్న అని మరోసారి రుజువైంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చే మార్చినెలలో జరుగనున్నాయి. ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. సెప్టెంబరు 30 నుంచి నవంబర్ 6వ రకు ఈనాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులను ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ కోరింది. ఈ పరిధిలో 10 లక్షలకుపైగా పట్టభద్రులు ఉంటారని అంచనా వేశారు. రాజకీయంగా అత్యధిక చైతన్యం ఉన్న ఈ జిల్లాల్లో పట్టభద్రులు పెద్ద ఎత్తున ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటారని, ఈసారి ఈ స్థానానికి హోరాహోరీ పోటీ ఉంటుందని అందరూ భావించారు.

● కొనసాగుతున్న పరిశీలన

గడువు ముగిసే వరకు 3,58,419 మంది పట్టభద్రుల దరఖాస్తులు మాత్రమే ఓటు హక్కు నమోదు కోసం అధికారులకు అందాయి. నియోజకవర్గ పరిధిలోని 15 కొత్త జిల్లాలోని 271 మండలాల నుంచి 3,58,419 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 3,55,496 దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా, 2,923 దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో నేరుగా సేకరించారు. ఇప్పటి వరకు దరఖాస్తుల పరిశీలన చేసిన వరకు 1,50,092 ఆన్‌లైన్ దరఖాస్తులను, 689 ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఓటు హక్కు పొందేందుకు అర్హతకలిగిన వారుగా గుర్తించి ఆమోదించారు. 14,922 దరఖాస్తులను తిరస్కరించారు. ఇంకా 1,92,716 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. ప్రస్తుతం 53.77 శాతం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మేరకు పరిశీలనలో మరో 15 వేల వరకు దరఖాస్తులు తిరస్కరణకు గురైనా మూడు లక్షల 30వేల వరకు ఓటు హక్కు పొందే అవకాశమున్నది. అధికారులకు అందిన ఈ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించిన తర్వాత ఈనెల 23న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేసేందుకు నవంబరు 23 నుంచి డిసెంబరు 9వరకు అవకాశం కల్పిస్తారు. డిసెంబరు 30న ఈ పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుంది. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరించే సమయంలో కూడా ఓటర్ల నమోదుకు అవకాశం కల్పిస్తారు.

● ఓటరు ఐడీ లేకపోవడం.. నిరాసక్తత కారణమే:

ఆధార్‌కార్డుతోపాటు ఓటరు ఐడీ కార్డు ఉంటేనే పట్టభద్రుల ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి వీలు ఉంది. ఎన్నికల కమిషన్ విధించిన ఈ నిబంధన ఓటర్ల నమోదుకు ప్రతిబంధకంగా మారింది. సాధారణ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపిస్తే సరిపోయేది. పట్టభద్రుల ఓటర్ల నమోదు కోసం మాత్రం ఆధార్‌తోపాటు ఓటర్ గుర్తింపు కార్డు తప్పనిసరి చేశారు. ఆధార్‌కార్డు అందరి వద్ద ఉన్నా ఓటరు ఐడీ కార్డు తీసుకోకపోవడంతో కొంత మంది ఓటరుగా నమోదు చేసుకోలేక పోయినట్లు చెబుతున్నారు. అన్నింటికి మించి ఓటు వేయడానికి, ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి విద్యావంతుల్లో రోజురోజుకు పెరుగుతున్న నిరాసక్తత కూడా మరో కారణంగా పేర్కొంటున్నారు.

● గడువు పెంచాలని డిమాండ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు

మిగతా 8వ పేజీలో...

● అవగాహన కల్పించినా..

ఎన్నికల కమిషన్ ఓటు హక్కు నమోదు కోసం షెడ్యూల్ విడుదల చేయక ముందు రెండు నెలల నుంచే పోటీ చేయాలని భావిస్తున్న వారు నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటించి సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి పట్టభద్రులను కలిశారు. స్వయంగా ఆశావహులే ఓటర్ల నమోదు పత్రాలతో ఊరూరా దరఖాస్తుల సేకరణ స్వయంగా చేపట్టారు. మిస్‌కాల్ ఇస్తే చాలు.. మీ ఇంటికే మా సిబ్బంది వచ్చి దరఖాస్తు ఫారంతోపాటు అవసరమైన డాక్యుమెంట్లను సేకరించి ఓటరుగా నమోదు చేపిస్తారని సోషల్ మీడియాలో, హోర్డింగ్‌లతో విస్తృతంగా ప్రచారం చేశారు. మండల స్థాయిలో కొంత మంది సిబ్బందిని ఏర్పాటు చేసి దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా పంపించే ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఈసారి పట్టభద్రులు లక్షల్లో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటారని ఆశించారు. అది వట్టిదేనని తేలిపోయింది.

పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన సమాజం

● తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఆనంద్, భారతి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆహార కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించవచ్చనిరాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, భారతి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ ఆహార భద్రత చట్టం అమలుపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపులు, పాఠశాలలు, గురుకులాలు సందర్శించామని తెలిపారు. ప్రతి రేషన్ దుకాణానికి బోర్డు, ఫిర్యాదుల పెట్టె, డీలరు, అధికారుల పేరు, ఫోన్ నంబరు తదితర వివరాలు కచ్చితంగా ఉండాలన్నారు. రేషన్ దుకాణాల్లో శుభ్రత పాటించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు, గుడ్లకు సరఫరాకు సంబంధించి ఇండెంట్ సరిపడా ఇవ్వాలన్నారు. పోషకాహార పంపిణీలో అంతరాయం రాకుండా చర్యలు తీసుకోవాలని శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఆహార హక్కుకు భంగం కలిగిస్తే కమిషన్ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. గర్భంలో ఉన్న శిశువు నుంచి ఆహార హక్కు లభిస్తుందని తెలిపారు. అందులో భాగంగానే అంగన్‌వాడీలు, రేషన్ దుకాణాలు, మధ్యాహ్న భోజన పథకం వంటివి పని చేస్తున్నాయన్నారు. ప్రతి పేదవాడికి అందుబాటు ధరలో ఆరోగ్యకరమైన భోజనం అందించడమే ఆహార భద్రత చట్టం లక్ష్యమన్నారు. జిల్లాలో ఆహార కమిషన్‌కి ఇన్‌చార్జిగా డీఆర్డీవో వ్యవహరిస్తారని తెలిపారు. ప్రజలు వారి ఫిర్యాదులను డీఆర్డీవోకు అందించవచ్చని చెప్పారు. జిల్లాలో కలెక్టర్ చేపట్టిన శుక్రవారం సభ మంచి ఫలితాలు ఇస్తోందన్నారు. కొత్తపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వందశాతం పిల్లలు సాధారణ బరువుతో జన్మించారని అన్నారు. ఆహార సమస్యలపై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో అందుతున్న ఫలితాలను పరిశీలించి విలువైన సలహాలు, సూచనలు ఇచ్చిన ఆహార కమిషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, డీఆర్డీవో శ్రీధర్, డీడబ్ల్యూవో సరస్వతి, డీఈవో జనార్దన్, డీఎంహెచ్‌వో వెంకటరమణ పాల్గొన్నారు.

యాసంగి పంటల ప్రణాళికపై అవగాహన



రైతులకు మొక్కజొన్న చిరు సంచులను అందిస్తున్న వ్యవసాయాధికారులు

భగత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటల సాగు ప్రణాళికపై కొత్తపల్లి మండలంలోని బద్దిపల్లి రైతు వేదికలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం, కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన కొత్తపల్లి మండలంలోని నాగుల మల్యాల రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దత్తత గ్రామ ఇన్‌చార్జి డాక్టర్ పి మధుకర్‌రావు మాట్లాడుతూ ఆరు తడి పంటల యాజమాన్య పద్ధతులను వివరించారు. డాక్టర్ జి ఉషారాణి మాట్లాడుతూ ఆరు తడిపంటల రకరాలు, సాగు వివరాలు తెలియజేశారు. వ్యవసాయ పరిశోధన స్థానం, మొక్కజొన్న పరిశోధన స్థానం హైదరాబాద్ ఆధ్వర్యంలో మొక్కజొన్నచిరు సంచులను రైతులకు అందించారు. అనంతరం ఉప్పు కనుకయ్య, మిట్ట లక్ష్మయ్య సాగు చేసిన మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం రాజేంద్రప్రసాద్, సమన్వయకర్త డాక్టర్ కె మదన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారి ఎం కృష్ణ ఏఈవో తిరుపతి పాల్గొన్నారు.

టీజీ ఎన్పీడీసీఎల్ ఎస్ఈగా రమేష్‌బాబు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఈ రమేశ్‌బాబు

గణేశ్‌నగర్,నవంబర్ 7 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈగా రమేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న వడ్లకొండ గంగాధర్ బదిలీపై మంచిర్యాలకు వెళ్లారు. ఆయన స్థానంలో కామారెడ్డిలో పనిచేస్తున్న రమేష్‌బాబు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ బాధ్యతలను రమేష్‌బాబుకు అప్పగించారు. అనంతరం రమేష్‌బాబును అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'మధ్యాహ్న భోజన మెనూను సవరించండి'

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూను సవరించి, విద్యార్థులకు సరిపడా పౌష్టికాహారాన్ని అందించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రెవెళ్లి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ ప్రభుత్వ ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఒక్కో విద్యార్థికి ఇస్తున్న 150 గ్రాముల బియ్యం సరిపోవడం లేదని, దాన్ని 300 గ్రాములకు పెంచాలని, పప్పుదినుసులు, ప్రతి రోజు కోడిగుడ్డు, పెరుగు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మాదిరిగా ప్రతి శుక్రవారం నాన్‌వెజ్ ఇవ్వాలని కోరారు. వంట కార్మికుల గౌరవ వేతనాన్ని, వంట చార్జీలను పెంచాలన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

కరీంనగర్ అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ హుస్సేన్‌పురలోని నేషనల్ ప్యాలెస్‌లో వివిధ పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ మైనార్టీ సెల్ నగరశాఖ ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అబుల్ కలాం అజాద్ జయంతి సందర్భంగా విద్యార్థులకు ఆయన జీవిత చరిత్రపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. పోటీలో వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా త్వరలో బహుమతులను అందజేస్తామని కాంగ్రెస్ మైనార్టీ సెల్ మైనార్టీ నగర శాఖ అధ్యక్షుడు అహ్మద్ అలీ తెలిపారు.

12లోగా కళాభారతి పనులను పూర్తి చేయండి



కళాభారతి ఆడిటోరియం ఆధునీకరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కళాభారతి ఆడిటోరియం ఆధునికీకరణ పనులను ఈ నెల 12న సాయంత్రంలోగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం ఆమె కళాభారతిలో చేపడుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కమిషనర్ సువార్త, ఎస్ఈ రాజ్‌కుమార్, డీఈ అయాబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ర్యాగింగ్, టీజింగ్‌పై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కరీంనగర్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్, టీజింగ్, పనిస్థలాల్లో వేధింపుల నియంత్రణ కోసం రూపొందించిన పోస్టర్‌ను కమిషనరేట్ కేంద్రంలో అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ గురువారం ఆవిష్కరించారు. తెలంగాణ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో షీటీం విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ షీటీం పోలీసులు ర్యాగింగ్, టీజింగ్‌ను అరికట్టేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ వేణుగోపాల్, కరీంనగర్ మహిళా ఠాణా సీఐ పి శ్రీలత, ఆర్ఐ రజనీకాంత్, కుమారస్వామి పాల్గొన్నారు.



పాడితో లాభాలు

- డెయిరీల ఏర్పాటుతో స్వయం ఉపాధి
- మేలైన జాతి ఆవులు, గేదెలతో మంచి పాల దిగుబడి

-సైదాపూర్, ఆంధ్రజ్యోతి

7

అభాగ్యులకు అండగా..

- నిరాశ్రయులకు కర్మకాండ వసతి గృహం
- నిరుపేదల అంత్యక్రియలకు రూ. ఐదు వేల ఆర్థికసహాయం
- ఆపద కాలంలో ఆదుకుంటున్న రామకృష్ణ సేవా సమితి ఆదర్శం

-సైదాపూర్, ఆంధ్రజ్యోతి

6

ఉద్యమకారులను గౌరవిస్తాం..

8

నగరపాలక సంస్థలో త్రిసభ్య కమిటీ విచారణ

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ ఆరోపణలపై కలెక్టర్ పమేలా సత్పతి నియమించిన త్రిసభ్య కమిటీ గురువారం నగర పాలకసంస్థ కార్యాలయంలో విచారణ చేపట్టింది. 44వ డివిజన్ కార్పొరేటర్ మెండి శ్రీలత, ఆమె భర్త, మాజీ కార్పొరేటర్ మెండి చంద్రశేఖర్ మేయర్ సునీల్‌రావు, కమిషనర్ చాహత్ బాజ్‌పాయిపై గతంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా ట్రెజరీ అధికారి, డీపీఆర్వోతో కూడిన త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించారు. ఈ కమిటీ గురువారం నగరపాలకసంస్థ కార్యాలయంలోని మహిళా కార్పొరేటర్ల చాంబర్‌లో విచారణ చేపట్టింది. ఫిర్యాదుదారులు మెండి శ్రీలత, మెండి చంద్రశేఖర్‌తోపాటు, సాక్షులను విచారించి, స్టేట్‌మెంట్లను రికార్డు చేసింది.

వైద్య విద్యార్థులతో పోలీసుల ఇంటరాక్షన్

భగత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులతో పోలీసులు శుక్రవారం ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీలు వెంకటరమణ, మాధవి విద్యార్థులకు చట్టాలు, నార్కోటిక్ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ సెల్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ ప్రదీప్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గడ్డం వినోద్ క్షమాపణ చెప్పాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దుర్గం మారుతి

సుభాష్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నేతకాని కులం గురించి మాట్లాడిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి క్షమాపణ చెప్పాలని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం మారుతి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేతకాని కులాన్ని మాలనేతగా మార్చాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడడాన్ని మీడియాలో చూశామన్నారు. ఇది తమను ఎంతో బాధించిందన్నారు. రాష్ట్రంలోని నేతకాని కులస్థులు ఇంతవరకు ఏ కులాన్ని గురించి మాట్లాడలేదన్నారు. తమది ప్రత్యేక కులం అని, సీరియల్ నంబరు 40గా ఉందని, తమ కులం ఉనికికి ప్రమాదం ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో నేతకాని కులస్థులు 15 లక్షల వరకు ఉంటారని, తమ కులానికి చెందిన వారు గోదావరి పరివాహక ప్రాంతాల్లో నివసించే వారమని, తమకు భూమి హక్కులు కల్పించేలా చూడాలని కోరారు. తమ ఉనికికి, హక్కులకు భంగం కలిగితే తాము న్యాయస్థానానికి వెళ్తామన్నారు. తమను నేతకాని కులస్థులుగానే ఉంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కోశాధికారి జాడి రాజు, గోదారి చంద్రయ్య, గోళ్లె రమేశ్, జాడి కనకయ్య, గోళ్లె లక్ష్మణ్, జాడి కొమురయ్య, బండారి లక్ష్మణ్, గోదారి సంపత్, జాడి రాజు, గోదారి బాలకిషన్, బండారి అంజనేయులు, జాడి ఎల్లయ్య అనిల్, బండారి గోపి పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా..

నిరాశ్రయులకు కర్మకాండ వసతి గృహం

- నిరుపేదల అంత్యక్రియలకు రూ. ఐదు వేల ఆర్థికసహాయం
- ఆపద కాలంలో ఆదుకుంటున్న రామకృష్ణ సేవా సమితి ఆదర్శం

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) అద్దె ఇంటిలో ఉన్న వారిలో ఎవరైనా మరణిస్తే కర్మకాండలు నిర్వహించేందుకు ఇంటి యజమానులు ఒప్పుకోని సంఘటనలు ఎన్నో ఎదురవుతున్నాయి. ఎక్కడ ఉండాలో.. ఏం చేయాలో.. ఎటూ పాలు పోని పరిస్థితులను ప్రస్తుతం అనేక మంది ఎదుర్కుంటున్నారు. ఇటువంటి వారికోసం రామకృష్ణ సేవా సమితి దాతల సహకారంతో చొప్పదండిలో నిరాశ్రయుల కర్మకాండ వసతి గృహాన్ని నిర్మించి, నిర్వహిస్తుంది. సొంత ఇల్లు లేని అనేక మందికి కర్మకాండ భవనంలో ఆశ్రయం కల్పించింది.

రామకృష్ణ పరమహంస ప్రేరణ, స్వామి వివేకానంద బోధనలు, రచనలకు ప్రభావితమై 2013లో చొప్పదండి కేంద్రంగా రామకృష్ణ సేవా సమితిని ఏర్పాటు చేశారు. నిరుపేద కుటుంబంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల నిర్వహణ కోసం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సేవా సమితి అందజేస్తోంది. కొవిడ్ కాలంలో మరణాలు సంభవించిన సమయంలో కర్మకాండలు నిర్వహించడం కష్టతరంగా మారడంతో నిరాశ్రయుల కర్మకాండల వసతి గృహం నిర్మాణం కోసం రామకృష్ణ సేవా సమితి ముందుకు వచ్చింది. చొప్పదండికి చెందిన పారుపెల్లి లక్ష్మి, వెంకటి జ్ఞాపకార్థం వారి కుమారుడు భవన నిర్మాణం కోసం 35 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. నిరాశ్రయుల కర్మకాండల వసతి గృహన్ని చొప్పదండిలో శివ కేశవ ఆలయ సమీపంలో నిర్మించారు. నిర్వహణ కోసం మరో ఆరు లక్షల రూపాయలను సేవా సమితి సేకరించింది.

● నాలుగు గదులు.. 11 రోజులు ఆశ్రయం

వసతి గృహంలో నాలుగు గదులను ఏర్పాటు చేయగా నాలుగు కుటుంబాలు ఆశ్రయం పొందవచ్చు. ఒక్కో కుటుంబం 11 రోజుల నుంచి నెల రోజుల వరకు ఆశ్రయం పొందుతున్నారు. తాగు నీటితో పాటు వంట చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు గదుల్లో ఉన్నాయి. నిరుపేదలకు అవసరమైతే నిత్యావసర వస్తువులను సేవా సమితి అందజేస్తుంది. చొప్పదండితో పాటు పొరుగు మండలాల నుంచి ఆశ్రయం కోసం అనేక మంది ఈ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్నారు. అంత్యక్రియల తరువాత మూడో రోజు నుంచి 11వ రోజు వరకు అన్ని కర్మలు నిర్వహించేందుకు వసతి గృహంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

దాతల సహకారంతో మర్నిన్ని వసతులు

- చెట్ల రాంకిషన్(గౌరవ అధ్యక్షుడు, రామకృష్ణ సేవా సమితి)



నిరాశ్రాయుల కర్మకాండ వసతి గృహం నిరుపేదలకు అండగా నిలుస్తుంది. దాతల సహకారంతో మరిన్ని వసతులను కల్పించేందుకు కృషి చేస్తాం.



కర్మకాండ భవనం



కర్మకాండ భవనంలో సహపంక్తి భోజనాలు

ఎన్నికల హామీని నిలబెట్టుకున్నాం



చెగ్యాంలో మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామం చెగ్యాం నిర్వాసితులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రూ.18 కోట్ల ముంపు నష్ట పరిహారానికి సంబంధించిన మిగులు చెక్కులను గురువారం మండలంలోని చెగ్యాం గ్రామంలో ఎంపీ గడ్డం వంశీతో కలిసి నిర్వాసితులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు సంబంధించి మిగిలిన 63 మంది లబ్ధిదారుల నష్టపరిహారానికి చెందిన చెక్కులను ఎంపీ వంశీతో కలిసి పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో తాను బాధితులకు పరిహారం ఇప్పిస్తానని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలు భూములను కోల్పోయినప్పటికీ పరిహారం అందించే విషయంలో గత బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదని తెలిపారు. చెగ్యాం గ్రామాన్ని ముంపు ప్రాంతంగా ప్రకటించడంలో దివంగత కాక వెంకటస్వామి పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముంపు బాధితుల పరిహారం కోసం చేసిన ప్రతీ నిరసనలో, ధర్నాలో వారి వెంట ఉండి ధైర్యాన్నిచ్చామని గుర్తుచేశారు. అర్హత ఉండి పరిహారం అందని వారు ఇంకా ఎవరైనా ఉంటే వారికి కూడా పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుం టామని తెలిపారు.

● భూ నిర్వాసితుల కలనెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

చెగ్యాం భూ నిర్వాసితుల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ పేర్కొన్నారు. తన తాత వెంకటస్వామి హయాంలో రూపకల్పన చేసిన ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిహారం చెక్కుల పంపిణీలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లంపల్లి భూ నిర్వాసితులకు న్యాయం చేయలేదన్నారు. ప్రభుత్వం కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శేఖర్, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయాన్ని తాకట్టు పెట్టుకొని రుణం ఇవ్వండి

- బ్యాంక్ మేనేజర్‌కు మాజీ సర్పంచ్ భర్త వినతి

మేడిపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయాన్ని తాకట్టు పెట్టుకొని తనకు రుణం ఇవ్వాలని ఓ మాజీ సర్పంచ్ భర్త దక్కన్ గ్రామీణ బ్యాంక్ (డీజీబీ) మేనేజర్‌కు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని తొంబర్రావుపేట గ్రామానికి చెందిన మామిడి సత్తమ్మ-ధర్మారెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో అప్పులు చేసి గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. గత సంవత్సరం ఉపాధి హామీ నిధులు 20 లక్షల రూపాయలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. 18 లక్షల రూపాయలు వెచ్చించి భవనాన్ని నిర్మించారు. ఇంకా కొంత పని చేయాల్సి ఉంది. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగాడు. వారం రోజుల క్రితం 7.46 లక్షల రూపాయలు విడుదలయ్యాయి. మిగతా బిల్లులు రాలేదు. తాను అప్పులు చేసి గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించానని, బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నానని మాజీ సర్పంచ్ సత్తమ్మ భర్త ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. తాను నిర్మించిన గ్రామపంచాయతీ కార్యా లయాన్ని తాకట్టు పెట్టుకొని తనకు అప్పు ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి బిల్లు రాగానే వడ్డీతో సహ తిరిగి చెల్లిస్తానని దక్కన్ గ్రామీణ బ్యాంక్ బ్యాంకు మేనేజర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించాడు.



బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ భర్త ధర్మారెడ్డి

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామంలో గురువారం రాత్రి మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న లారీలను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి పగలు రాత్రి అనే తేడా లేకుండా లారీలతో ఇసుకను తరలించడం వల్ల దుమ్ము, ధూళితో ఇబ్బదులు పడుతున్నామని చెప్పారు. రోడ్లు అన్ని ధ్వసమవుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో చర్చించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గంభీరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దేవవ్వ పిల్లలు చదవుల నిమిత్తం హాస్టల్ ఉంటున్నారు. దేవవ్వ భర్త సత్యంకు వైద్యం చేయించేందుకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లింది. రాత్రి ఇంటి తాళాలు పగుల గొట్టిన దొంగలు 2 తులాల బంగారు, 34 తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు.

ఆభరణాలు తీసుకొని మోసం

- కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఒక శుభకార్యానికి వెళ్లేందుకు ఆభరణాలు కావాలని తీసుకుని తిరిగి ఇవ్వకుండా బెదిరింపు లకు పాల్పడిన నిందితురాలిపై కేసు నమోదు చేశామని కరీంనగర్ మూడో రాణా పోలీసులు తెలిపారు. బ్యాంక్ కాలనీకి చెందిన చెన్నమల్ల లక్ష్మి వద్ద అక్టోబరు 21న అదే ప్రాంతానికి చెందిన మడనాటి అరుణ 4 తులాల బంగారు ఆభరణాలు, 15తులాల వెండి గొలుసులను తీసుకుని శుభకార్యం తరువాత తిరిగి ఇస్తానని నమ్మబలికిందని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తన బంగారు, వెండి ఆభరణాలు తిరిగి ఇవ్వాలని బాధితురాలు కోరగా బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

వెల్గటూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన బండమీది రాజమణి (56) అనే మహిళ గురువారం ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమణి పుట్టుకతో ఫిట్స్ వ్యాధితో బాధపడుతోంది. వివాహం అయినప్పటికీ ఫిట్స్ వ్యాధి కారణంగా విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి తల్లి గౌరమ్మ దగ్గర ఉంటోంది. కాగా గురువారం మంచి నీటి కోసం ఇంటి వెనుక గల బావి దగ్గరకు వెళ్లింది. ఎంతసేపైనా రాకపోయే సరికి చుట్టుపక్కల వెతికారు. అనుమానం వచ్చి పాతాళగరిగెతో బావిలో వెతకగా ఆమె మృతదేహం బయటపడింది. రాజమణి తల్లి గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ జి రాము అన్నారు. పట్టణంలోని రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కాన్సియస్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం సీఐ రాము మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాల బారినపడి చేజేతులా భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, చైల్డ్ కేఫ్, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది రమేష్, సంపత్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, జగన్, సారిక తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూములను కాపాడాలి



ఆర్ఐ ప్రవీణ్‌తో వాగ్వాదం చేస్తున్న తండా వాసులు

వీర్నపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెరువు శిఖం భూములను కాపాడాలని వీర్నపల్లి మండలంలోని వన్ పల్లి కేలోత్ తండా గ్రామస్థులు గురువారం ఆందోళనకు దిగారు. సర్వే కోసం తండాకు వచ్చిన ఆర్ఐ ప్రవీణ్‌తో వాగ్వాదానికి దిగారు. భూములు కబ్జాకు గురవుతున్నాయని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుకు సంబంధించిన భూమికి ఎలా పట్టాలిస్తారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించాలని, భూమిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తండావాసులను అక్కడి నుంచి పంపించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం

తంగళ్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 48 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు. గురువారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామం నుంచి మినీవ్యాన్‌లో బియ్యం తరలిస్తున్నరనే సమాచారంతో తంగళ్లపల్లి పోలీసులు, జిల్లా టాస్క్‌ఫోర్సు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 48 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న, కొనుగోలు చేస్తున్న జిల్లెలకు చెందిన గాండ్ల నితిన్, పాండు, రాజు, గుగు లోతు అంగుర నెరెళ్ల గ్రామానికి చెందిన డ్రైవర్లు శ్రీను, ప్రశాంత్‌తోపాటు వేములవాడ మండలం వట్టిముల గ్రామానికి చెందిన సముద్రాల ప్రశాంత్‌పై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్సు ఎస్సై సుధాకర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

సుల్తానాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. నారాయణపూర్ గ్రామానికి చెందిన ముత్యాల పోచమ్మ(81) కళ్లు సరిగా కనబడకపోవడంతో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయిందని గ్రామస్థులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

కోల్‌సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని గంగానగర్ ఏరియాలో గురువారం వన్‌టౌన్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి నేతృత్వంలో ప్రతి ఇంటిని తనిఖీ చేసి, వివరాలను తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి జరమానాలు విధించారు. 13 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని వాటి యజమానుల వివరాలు తెలుసుకుని వారికి అప్పగించారు. గంగానగర్ ఏరియాలో అనుమానితులు కనబడితే సమాచారం ఇవ్వాలని, అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దని సీఐ ఇంద్రసేనారెడ్డి స్థానికులకు సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ ద్వారా మోసాలు చేసే అవకాశాలు ఉన్నందున అపరిచిత ఫోన్‌కాల్స్‌కు బ్యాంక్ ఖాతాల, ఓటీపీ, ఏటీఎం నంబర్లు వంటివి చెప్పవద్దని సూచించారు. ఈ కార్డన్‌సెర్చ్‌లో ఎస్సైలు, కానిస్టేబుళ్లు సిబ్బంది పాల్గొన్నారు.



గోదావరిఖనిలో వివరాలు తెలుసుకుంటున్న సీఐ ఇంద్రసేనారెడి



కేసీఆర్‌నగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

తంగళ్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్‌నగర్‌లో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు తదితర అంశాలపై ఆరా తీశారు. ద్విచక్ర వాహనాల పత్రాలను పరిశీలించారు. టెక్స్‌టైల్ పార్కు గేట్ వద్ద తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లడుతూ అను మానిత వ్యక్తులు సంచరించినా, అసాంఘీక కార్యక్ర మాలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థలు వినియోగించినా, విక్రయించినా వారి వివరాలు పోలీసులకు అందించాలని సూచించారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. యువత వ్యసనాల బారిన పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్ఐ రాంమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంకరపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగల దేవి (41) అనే మహిళ ఈ నెల 4న ఉదయం పాడి ఆవును మేతకు వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్తుండగా కుడికాలుపై పాముకాటు వేసింది. దేవి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలుపడంతో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు జమ్మికుం టలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరిగి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి గురువారం ఉదయం తీసుకువచ్చారు. డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దేవి భర్త వెంగల కుమార స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ యువకుడు..

ఓదెల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన గ్యారవేణి శ్రీనివాస్ (40) అనే యువకుడు గురువారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వారం క్రితం శ్రీనివాస్ హరిపురం నుంచి కొలనూర్ వైపు వెళుతున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన జిల్లెల మల్లారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మల్లారెడ్డి తన స్కూటీపై వస్తుండగా వెనుక నుంచి సీతంపేట గ్రామానికి చెందిన చిలుక అజయ్ తన బైక్‌ను అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టాడు. మల్లారెడ్డి కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మల్లారెడ్డి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

అప్పులు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

ముస్తాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అప్పుల ఇచ్చిన వారి వేధింపులు తాళ లేక తల్లీకూతుళ్లు ఆత్మహత్యకు యత్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని మొర్రాయిపల్లెకు చెందిన గుండం బాలమల్లు ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బాలమల్లు అనారోగ్యంతో ఉన్నప్పుడు రూ. 20 లక్షల వరకు అప్పులు చేశాడు. అతడు మరణించిన తర్వాత అప్పులు తీర్చాలని అతడి భార్య మంజుల, కూతురు అఖిలను అప్పులు ఇచ్చిన వారు వేధిస్తున్నారు. గురువారం ఉదయం వారి ఇంటికి వచ్చి ఇష్టారీతిన మాట్లాడంతో ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఉరేసుకున్నారు. గమనించిన స్థానికులు తలుపులు బలవంతంగా తెరిచి వెంటనే వారిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తల్లి మంజుల ప్రాణాపాయ స్థితి నుం చి బయటపడింది. అఖిల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

డబ్బులు ఇస్తానంటూ మోసం

- పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు



నిందితుడిని చెట్టుకు కట్టేసిన గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెగడపల్లిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు ఇస్తానంటూ మోసానికి పాల్పడ్డాడు. గ్రామంలో కిరాణా షాపు నడుపుతున్న సుమలత అనే మహిళ వద్దకు గురువారం వెళ్లి ఎస్సీ కాలనీ దగ్గర ఇల్లు ఉంటుందని, 50వేల రూపాయలు ఫోన్ పే చేస్తే డబ్బులు ఇస్తానంటూ నమ్మబలికాడు. దీంతో ఆమె డబ్బులు పంపగా, మరో 30 వేలు పంపాలని కోరాడు. ఆమె తన వద్ద డబ్బులు లేవని చెప్పినా వినకపోవడంతో ఆమె పోలీసులు, గ్రామస్థులకు సమాచారం అందించింది. చుట్టుపక్కల వారు వచ్చి అతడిని నిలదీయగా ఆ డబ్బులు వేరే నంబర్‌కు వెళ్లాయని, తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో పాటు తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో గ్రామస్థులు అతడిని చెట్టుకు కట్టేశారు. పోలీసులు నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ లింగాపూర్ శివారులో గురువారం జాతీయ రహదారి పక్కన ఉన్న బావిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. రహదారి పక్కన ఉన్న బావిలో వ్యక్తి దాదాపుగా 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడి ఒంటిపై బూడిద కలర్ టీ షర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు మెట్‌పల్లి సీఐ 8712656819, ఇబ్రహీంపట్నం ఎస్ఐ 8712524667 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ అనిల్ కోరారు.

మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఆరుగురు పారిశుధ్య కార్మికులకు గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

కోరుట్ల, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో విధులు నిర్వహించాడానికి మున్సిపల్ ట్రాక్టర్‌లో వెళ్తున్న పారిశుధ్య కార్మికుల ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం ఢీ కొట్టింది. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీ కొట్టగా ఘటనలో ఆరుగురికి గాయలుకాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న రాగుల కనకతార, బొల్లె కార్తీక్, బైరి రాధ, సుగుణ, గంగు, రేణుకకు గాయాలు అయ్యాయి. ఇందులో కనకతార, కార్తీక్ పరిస్థితి విషమంగా ఉంది. కాగా రాగుల కనకతార ప్రస్తుతం గర్భిణి. పోలీస్‌లు, మున్సిపల్ సిబ్బంది అక్కడకు చేరుకోని గాయాలపాలైన కార్మికులను జగిత్యాల ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని గురువారం కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని రాజన్నపేటకు చెందిన తేజక గొల్లపల్లి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కారు టైర్ పగిలి ప్రమాదానికి గురైందని స్థానికులు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో కంతం సరళ అనే వివాహిత అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ గురువారం తెలిపారు. గ్రామంలోని నర్సయ్య పెద్ద కూతురు సరళకు అదే గ్రామానికి చెందిన ఉదయ్‌తో 2013లో వివాహమైంది. నర్సయ్యకు కొడుకు లేకపోవడంతో కూతురు సరళ, అల్లుడు ఉదయ్ అతడి వద్ద ఉంటూ జీవిస్తున్నారు. ఈ నెల 6న సరళ రాత్రి వంట చేయకపోవడంతో తండ్రి నర్సయ్య మందలించాడు. దీంతో ఆమె ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. చుట్టు పక్కల, బంధువుల వద్ద గాలించిన ఆచూకీ లభించలేదని తెలిపారు. బాధితుడు నర్సయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ వివరించారు.

పాడితో లాభాలు

- డెయిరీల ఏర్పాటుతో స్వయం ఉపాధి
- మేలైన జాతి ఆవులు, గేదెలతో మంచి పాల దిగుబడి

రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువులను పెంచుతూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. మేలైన పశువులను ఎంచుకుని మంచి పాల దిగుబడిని సాధిస్తు న్నారు. పాలను తామే అమ్ముకుంటూ లాభాలు సాధిస్తున్నారు. సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో యువకులు, రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు.

◆ సైదాపూర్



అనిల్ డెయిరీ ఫామ్‌లో ఆవులు



ఆవులకు వేసేందుకు గడ్డిని చిన్న చిన్న ముక్కలు కట్ చేస్తున్న అనిల్

■ జాగీర్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పారు అనిల్ అనే యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. తల్లితండ్రులను వదిలి ఎక్కడికో ఉద్యోగం చేయడానికి వెళ్లడం ఎందుకు అని అలోచించి డెయిరీ ఫామ్ పెట్టుకున్నాడు. కేడీసీసీ బ్యాంక్ నుంచి 20 లక్షల రూపాయల రుణం తీసుకున్నాడు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి 14 పాడి ఆవులు, ఒక గేదెను తీసుకొచ్చాడు. వాటికి షెడ్డు ఏర్పాటు చేసి తమ వ్యవసాయ భూమిలో గడ్డిని పెంచుతూ మేతగా ఇస్తున్నాడు. డెయిరీ ఫామ్‌లో తనకు సహాయంగా బిహార్‌కు చెందిన ఓ యువకుడిని జీతంగా పెట్టుకున్నాడు. వీరిద్దరు ప్రతి రోజు ఆవుల పోషణ చూస్తూ పాలు పితుకుతూ మార్కెట్‌కు పంపిస్తారు. అనిల్ ప్రస్తుతం నెలకు ఖర్చులు పోను 60 వేల రూపాయల వరకు సంపాదిస్తున్నాడు. పశువుల ద్వారా వచ్చిన ఎరువును భూమిలో వేసుకుంటున్నాడు.

సంతృప్తిగా ఉంది.

- ఉప్పారపు అనీల్, యువ రైతు, జాగీర్‌పల్లి



ఎక్కడో ఉద్యోగం చేస్తూ ఇబ్బంది పడడం కన్నా సొంతగా డెయిరీ ఫామ్ నడుపుకోవడం సంతృప్తిగా ఉంది. ప్రస్తుతం 15 పాడి పశువులను పెంచుతున్నాను. అన్ని ఖర్చులు పోనూ నెలకు 70వేల వరకు మిగులుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య సొంత ఊరిలో పని చేసుకోవడం సంతృప్తిగా ఉంది.



డెయిరీఫామ్‌లో రవీందర్ రెడ్డి

■ మండలంలోని దుద్దెనపల్లికి చెందిన చెప్యాల రవీందర్ 13 గేదెలతో, తాటిపెల్లి సీతారాం 12 గేదెలు, ఆవులతో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నారు. వీరు ఆరు సంవత్సరాలుగా పశు పోషణ చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. చెప్యాల రవీందర్ సైదాపూర్ మండల కేంద్రంలో ఓ గదిని తీసుకుని తమ ఫామ్ నుంచి వచ్చిన పాలను అమ్ముతున్నాడు. ఖర్చులు పోను నెలకు 50 వేల రూపాయల వరకు మిగులుతున్నాయని వారు అంటున్నారు. వ్యవసాయంతోపాటు డెయిరీ ఫామ్ నడపడం వల్ల లాభదాయకంగా ఉందని వారు తెలిపారు. పని వాళ్లపై భారం వేయకుండా యజమానులు దగ్గరుండి పశువులను చూసుకుంటే మంచి లాభాలు సాధించవచ్చని వారంటున్నారు.

లోకల్‌గా పాలు అమ్మితే లాభాలు వస్తాయి

- చెప్యాల రవీందర్‌రెడ్డి, డెయిరీ ఫామ్ నిర్వాహకుడు, దుద్దెనపల్లి



నేను 13 సంకర జాతి గేదెలను తెచ్చి ఆరు సంవత్సరాలుగా డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాను. మంచి లాభాలు వస్తున్నాయి. పెట్టిన పెట్టుబడి పూర్తిగా వచ్చింది. సైదాపూర్ మండల కేంద్రంలో రూం తీసుకొని ప్రతీ రోజు ఉదయం ఏడు గంటల వరకు గేదె పాలు అమ్ముతున్నాను. మంచి లాభం వస్తుంది. ప్రతీ నెల ఖర్చులు పోను 50 వేల రూపాయల వరకు మిగులుతున్నాయి.

కొనసాగుతున్న గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆరో రోజు గురువారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు గోదావరి నది వద్ద విశేష పూజలు జరిపారు. అనంతరం రాత్రి నదీ మాతకు హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు అరుణ్‌కుమార్, అశ్విన్, వంశీకృష్ణ, విజయ్, నవీన్, మోహన్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో కొనసాగుతున్న కార్తీక రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక రద్దీ కొనసాగుతోంది. గురువారం రాజన్న ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఆలయ ముందు భాగంలోని రావిచెట్టు ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతీ పరమేశ్వరు లను దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించు కున్నారు. అనంతరం గండ దీపంలో నూనె పోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు.

చదరంగంతో ఆలోచనా శక్తి పెంపు



చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఆలోచనా శక్తి పెంపొందుతుందని డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వేణుగోపాల్ అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-17, అండర్-14 బాల బాలికల ఉమ్మడి జిల్లా చదరంగ పోటీలు గురువారం జీనియస్ చెస్ అకాడమీలో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వేణుగోపాల్ మొదటి ఎత్తు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదరంగంలో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శంకరయ్య, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, సృజన్‌కుమార్, సతీష్‌బాబు, చీఫ్ ఆర్బిటర్ తరుణ్, ఆర్బిటర్లు, రేవిక్, నితిన్, శ్రీనిజ, పీఈటీలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబర్ 07 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,900 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 128మంది రైతులు 1,239క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు 13క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,900, కనిష్ఠ ధర 6,200 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

డీఎస్పీల బదిలీ

కరీంనగర్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని పలువురు డీఎస్పీల బదిలీలు జరిగాయి. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జగిత్యాల డీసీఆర్‌బీలో పనిచేస్తున్న డీఎస్పీ జి మహేష్‌బాబును కరీంనగర్ పీటీసీ డీఎస్పీగా బదిలీ చేశారు. అలాగే కరీంనగర్ పీటీసీలో పనిచేస్తున్న బి రామానుజంను ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డీఎస్పీగా బదిలీ చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆసిఫాబాద్ డీఎస్పీగా, ఆసిఫాబాద్ డీఎస్పీ పి సదయ్యను హైదరాబాద్ చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిర్మల్ డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న పి రవీందర్‌రెడ్డి ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేశారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని మరికొందరు ఏసీపీలకు త్వరలో బదిలీలు జరుగను న్నట్లు సమాచారం. ఇందులో కొందరు ఏసీపీలకు పదోన్నతులు రానున్నాయి.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు సైనిక స్కూల్ విద్యార్థుల ఎంపిక

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుక్మాపూర్ సైనిక స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో స్వరూప్, నరేష్, విజయ్‌కుమార్, అరవింద్, రాంసుధీర్, వర్షిత్‌కుమార్ ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో శ్రీసాయి, అజయ్, పునీత్ చంద్ర, చంద్రశేఖ, శశివదన్, మహేష్, సాహూ మహారాజ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు.

ఆలయ హుండీ లెక్కింపు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. హుండీ ద్వారా 2.42.389 రూపాయల ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వాహణాధికారి మారుతి తెలిపారు.

డెడికేషన్ కమిటీ ఏర్పాటు హర్షణీయం


- వెనుకబడిన వర్గాల్లో ఆశలు చిగురింపజేస్తున్న కులగణన సర్వే - ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుతనానికి గురైన బీసీలకు రాజ్యాంగబద్ధంగా కల్పించాల్సిన రిజర్వేషన్ సౌకర్యాల కోసం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలహీన వర్గాల అభ్యున్నతిలో భాగంగా రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం డెడికేషన్ కమిటీ వేసిందన్నారు. బలహీన వర్గాలకు స్థానికసంస్థల్లో రిజర్వేషన్ల కల్పనకు ఉమ్మడి రాష్ట్రంలోనే చట్టం రూపొందించారన్నారు. 2004లో యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆలోచ నలకు అనుగుణంగా అల్పసంఖ్యాక వర్గాలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. బలహీన వర్గాల న్యాయం చేయాలనే తలంపుతోనే రాహుల్ గాంధీ వివరాలు సేకరించేందుకు సర్వే చేయాలని ఆదేశించారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లోనే కులగణన అంశం ప్రస్తావించడంతో ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సర్వేతో ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా చూడాలని సీఎంకు లేఖ రాశానని అందులో సర్వే చేసే రోజు సమాచారం ఉండేలా చూడాలని కోరానన్నారు. కొందరికి ఇంటి నంబర్లు లేక బయట గుడిసెలు వేసుకోని ఉన్నారని, కొందరు సంచార జాతులు కూడా ఉన్నారని అలాంటి వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించి స్పష్టమైన వివరాలు సేకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సర్వేకు ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే నేటికీ బహిర్గతం కాలేదన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత, చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. పనిచేసే ప్రభుత్వంపై అక్కసుతోనే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సహజం అన్నారు. నవంబరు నెలలోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, గ్రామసభల ద్వారా అర్హులను ఎంపిక చేసి నిర్ణయం తీసుకుంటారన్నారు. సర్వేపై ప్రజలు అపోహలు పడొద్దని, ఆందోళన చెందవద్దని కోరారు. సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవ న్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, మండల బ్లాక్ ప్రెసిడెంట్ నందయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మాజీ ఎంపీపీ రమేష్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నాయకులు నెహాల్, చాంద్‌పాషా, గుండా మధు, విజయ్, మహేష్ తదితరులు ఉన్నారు.





శ్రీనివాస్ వేసిన చిత్రాలు

ఊహా చిత్రం.. కళాత్మకం

చిన్నప్పటి నుంచి ఆ యువకుడికి చిత్రకళ అంటే ఆసక్తి. గీసిన ప్రతీ చిత్రంలో జీవం ఉట్టిపడుతుంది. ప్రకృతి రమణీయతతోపాటు ఊహల్లోని చిత్రాలకు ప్రాణం పోస్తాడు. తనలోని ప్రతిభనను సానపట్టాలనుకొని ఫైన్ ఆర్ట్స్‌లో చేరాడు. పలు ప్రాంతాల్లో ఆర్ట్స్ గ్యాలరీలు ఏర్పాటు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు.

- చిత్రకళలో రాణిస్తున్న రుద్రంగి యువకుడు
- స్టేట్ ఆర్ట్స్ గ్యాలరీల్లో ప్రదర్శనలు

రుద్రంగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మనసులో మెదిలే భావాలకు తన కుంచెతో ప్రాణం పోస్తున్నాడు రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మంచె శ్రీనివాస్. చిన్నతనం నుంచి శ్రీనివాస్‌కు చిత్రకళ అంటే ఇష్టం. దానినే ఉపాధిగా మల్చుకోవాలనుకున్నాడు. గురువు ఎలిగేటి నరేష్ వద్ద మెళకువలు నేర్చుకున్నాడు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేశాడు. లైవ్ ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్స్‌లో ప్రతిభ చాటుతున్నాడు. ముఖ్యంగా, పాత కాలపు కట్టడాలు, గ్రామీణ జీవితాన్ని ప్రత్యక్షంగా చిత్రించడం ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. పల్లెలోని జీవన శైలి, గ్రామీణుల సంప్రదాయాలు శ్రీనివాస్ చిత్రాల్లో ప్రతిబింబిస్తాయి. పల్లె జీవన సౌందర్యాన్ని సమకాలిన ప్రపంచానికి పరిచయం చేస్తున్నాడు. ప్రస్తుతం అబ్‌స్ట్రక్ట్ పెయింటింగ్‌లో శ్రీనివాస్ రాణిస్తున్నాడు. శ్రీనివాస్ వేసిన చిత్రాలను ఆర్ట్‌గాలరీలో ప్రదర్శిస్తున్నాడు. సొంత ఖర్చులతో 2017లో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో స్టేట్ ఆర్ట్స్ గ్యాలరీలో సూమారు 85 చిత్రాలను ప్రదర్శించాడు. 2019లో అవిమ్న పేరిట హైదరాబాద్‌లోని కళాకృతి ఆర్ట్స్ గ్యాలరీలో మరోసారీ ప్రదర్శించాడు. 2023లో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఆర్ట్స్ గ్యాలరీలో క్యాంపస్ డైరీస్ పేరిట 30 చిత్రాలను ప్రదర్శించాడు. రాష్ట్ర, జాతీయస్థాయి ఆర్ట్‌గాలరీల్లోనూ శ్రీనివాస్ చిత్రలాను ప్రదర్శించాడు. ఆర్ట్‌గాలరీల్లో శ్రీనివాస్ వేసిన చిత్రాలు నచ్చినవారు వాటిని కొనుగోలు చేయడంతో ఆదాయం పొందుతన్నాడు. వీటితోపాటు హోటళ్ల, ఆస్పత్రుల నుంచి అర్డర్లు పొదుతున్నాడు.



హైదరాబాద్‌లో జరిగిన ఓ ప్రదర్శనలో తన పెయింటింగ్‌లను చూపుతున్న శ్రీనివాస్

అంతర్జాతీయస్థాయిలో చిత్రాలను ప్రదర్శించాలి

- మంచె శ్రీనివాస్, చిత్రకారుడు, రుద్రంగి.



ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్ట్‌గాలరీల్లో చిత్రాలను ప్రదర్శించాను. అక్కడ మంచి గుర్తింపు వచ్చింది. అంతర్జాతీయస్థాయిలో ఆర్ట్‌గాలరీల్లోనూ చిత్రలాను ప్రదర్శించాలి. నా చిత్రాల్లో సామాజిక సమస్యలు, వ్యక్తిగత భావాలను చేరుస్తున్నాను. ప్రతీ కళ సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. వ్యక్తిగత మానసికతను మారుస్తుంది.

నీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

య్రైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 7: నీటి కోసం ఖాళీ బిందెలతో కాలనీ హనుమాన్‌నగర్ మహిళలు గురువారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి కార్పొరేషన్, సింగరేణి నీళ్లు వచ్చేవని, వారం రోజులుగా సింగ రేణి పూర్తిగా నీటి సరఫరాను నిలిపివేసినట్టు మహిళలు తెలిపారు. రోజు విడిచి రోజు వచ్చే మిషన్ భగీరథ నీళ్ళు సైతం మూడు రోజులుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికేతర వాడలకు సింగరేణి నీటి సరఫరా నిలిపివేయడం సరికాదని, యథావిధిగా నీటి సరఫరా చేయాలని మహిళలు డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల పరిశీలకుడిగా శ్రీను

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 7: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు పరిశీలకుడిగా జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ జి.శ్రీను నియమితులయ్యారు. సిద్దిపేట జిల్లాలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోరపల్లి జడ్పీహెచ్‌ఎస్ పీడీ శ్రీనును అబ్జర్వర్‌గా నియమిస్తూ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీను రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణ, మైదానాలు, సదుపాయాలు తదితర విషయాలను పరిశీలించి నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నివేదించాల్సి ఉంటుంది. రాష్ట్ర పరిశీలకుడిగా శ్రీను ఎంపిక పట్ల జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం టీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, మహమ్మద్ యూనిస్‌పాషా, సీనియర్ పీడీలు సంపత్‌రావు, కే కృష్ణ, బాబు శ్రీనివాస్, గిన్నె లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

వాలీబాల్ పోటీలకు ఆసిఫ్‌నగర్ విద్యార్థి ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు

భగత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లి మండలం లోని ఆసిఫ్‌నగర్ విద్యార్థి గుగులోతు అనిత ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ప్రధా నోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో వ్యా యామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, వాసంతి, శివకుమార్, రాజేంద్రప్రసాద్, ఏంజెలీస్, గంగాచారి, నాగవేణి, హరికృష్ణశర్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా వనిత

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.వనితను డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ సీడీఎంఎ జాయింట్ డైరెక్టర్ బోనగిరి శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వనితను డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తూ వెంటనే విధుల్లో చేరాలని ఆదేశిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ కార్పొరేషన్‌లో శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో ఆమెను డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు.

మున్నూరుకాపు సంఘం కార్యవర్గం

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మంకమ్మతోట మున్నూరుకాపు సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షుడు ముప్పిడి సునీల్‌కుమార్ తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా దిండిగాల రమేశ్, ఉపాధ్యక్షులుగా సోమినేని శ్రీపతి, ఎన్నం చిరంజీవి, కట్నం శ్రీనివాస్, కంటె శంకర్, నల్ల కరుణాకర్, బొబ్బిలి వంశీ, సంయుక్త కార్యదర్శులుగా చెట్టి నర్సయ్య, సిరిపురం కుమార్, బండి ప్రమోద్ దీపక్, ఈనంపల్లి రామకృష్ణ, గడ్డాల సుధీర్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బత్తుల రవీందర్, కూరగాయల తిరుపతి, అట్ల ధీరజ్, పూరెళ్ళ మధు, కామినేని శ్రీధర్ ఎన్నికైనట్లు తెలిపారు.

ప్రత్యేక ఆహ్వానితులుగా కర్ర రామలింగా రెడ్డి, కొత్త శ్రీధర్, కట్నం రాములు, సాన దయాకర్, పిన్నింటి వెంకటనర్సయ్య, ముఖ్య సలహాదారులుగా దిండిగాల రవీందర్, మంగు నర్సింహాద్రి, జొన్నలగడ్డ అశోక్‌కుమార్, గుర్రాల వెంకట్ రమణ, జక్కుల సత్యనారాయణ, నునుగొండ మల్లయ్య, జక్కుల మధు ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

సీఎంను కలిసిన టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ

కరీంనగర్ అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని గురువారం హైదరదాబాద్‌లోని ఆయన నివాసంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కరీంనగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ సమద్ నవాబ్‌ను కలిసి ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సీఎంను శాలువాతో సన్మానించారు. ఈ నెల 11న కరీంనగర్‌లో సమద్ నవాబ్ కొడుకు ఎంఎం అలీం నవాజ్ వివాహవేడుకకు హాజరుకావాలని ఆహ్వానించారు.

'ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం'

గన్నేరువరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్యవం తమైన సమాజాన్ని నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార భద్రత కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ అన్నారు. మండలంలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి గ్రామాలలోని రేషన్ దుకాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను అధికారులతో కలిసి ఆయన గురువారం తనిఖీ చేశారు. జంగపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, మెనూ ప్రకారం భోజనం వివరాలను అడిగి తెలుసున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం అందించేందుకు రాజ్యాంగం హక్కు కల్పించిందని అన్నారు. పౌష్టికాహారం అందించడంలో సంబంధిత రేషన్‌డీలర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు మేరకు వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు.



జంగపల్లిలో మాట్లాడుతున్న ఓరుగంటి ఆనంద్

విద్యార్థులు రక్తహీనతతో ఇబ్బందులు పడకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కేంద్రాల సిబ్బంది పాలు, గుడ్లు, పోషకాహారం సక్రమంగా అందించకుంటే ఫుడ్ కమిషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. మండలంలో తన దృష్టికి వచ్చిన పలు అంశాలను జిల్లా కేంద్రంలో నిర్వహించే రివ్యూ మీటింగ్‌లో ప్రస్తావిస్తామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, డీఈవో జనార్దన్‌రావు, డీఎస్‌వో నరసింహారావు, డీఎం రజనీకాంత్, డీఆర్‌డీవో శ్రీధర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఎంఈవో రామయ్య, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన ఫుడ్ కమిషన్ సభ్యులు

భగత్‌నగర్: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, భారతిలు గురువారం కొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. జాతీయ ఆహార భద్రత చట్టం 2013 ఎలా అమలు జరుగుతుందో వైద్యాధికారి డాక్టర్ నాజీయా ఫాతిమ, పీహెచ్‌సి సిబ్బంది, ఆశా కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, అదనపు జిల్లా వైద్యఆరోగ్య శాఖఅధికారి డాక్టర్ సన జవేరియా, పిఓ ఎంసిహెచ్ డాక్టర్ మౌనిక, స్వామి, డిపిఓ రామనాథం పాల్గొన్నారు.

ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్ల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఓటు హక్కు వినియోగించుకోవడంపై 2024సంవత్సరంలో ఓటర్లకు అవగాహన పెంపొందించి చైతన్య పరచడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి, భారత ఎన్నికల సంఘం మీడియా అవార్డులను ప్రకటించినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా హౌస్‌ల నుంచి 2024సంవత్సరానికి ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డులు ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఆన్‌లైన్ సోషల్ మీడియాకు ఒక్కొక్కటి చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓటరు హక్కులపై అవగాహన పెంపొందించడం, ఎలక్షన్ టెక్నాలజీ అంశాలను ప్రచారం చేయడం వంటి అంశాల్లో ప్రాముఖ్యతను చూపిన మీడియా సంస్థలను గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అవార్డులను జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా 2025 జనవరి 25న అందజేయనున్నట్లు తెలిపారు. ప్రచార నాణ్యత, ప్రజా పరిజ్ఞానం, ఓటర్లకు సరైన సమాచారాన్ని అందించడం, ప్రత్యేక కథనాలు, చర్చలు వంటి అంశాల ఆధారంగా ఈ అవార్డులను నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ప్రతి విభాగంలో పాల్గొనే సంస్థలు తమ ప్రచారం యొక్క సారాంశం, ప్రచురణ లేదా ప్రసారం యొక్క వార్త ఇతర సంబంధిత ప్రచార కార్యకలాపాలతో సహా నిజ ప్రతులను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 2024లోగా తమ సిఫార్సును రాజేష్ కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోక రోడ్, న్యూ ఢిల్లీ చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. హిందీ లేదా ఇంగ్లీష్ కాకుండా ఇతర భాషలలో ఉన్నట్లైతే ఆంగ్ల అనువాదం కూడా జతపరచాలని తెలిపారు. ప్రతి విభాగంలో ఉన్నత ప్రమాణాలు తీసుకున్న ప్రసార సమయం, ప్రజలపై చూపిన ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. ప్రింట్ మీడియా ప్రచురించిన వ్యాసాల సంఖ్య ఆర్టికల్స్ ప్రచురించిన ప్రింట్ ఏరియా స్క్వేర్ సెంటి మీటర్లు, పాఠకులలో అవగాహన కల్పించేందుకు చేసిన కార్యక్రమాల సమాచారాన్ని పీడీఎఫ్ సాఫ్ట్‌కాపీ సమర్పించాలని తెలిపారు. ప్రతి ఎంట్రీని ప్రచారం నాణ్యత, ప్రజలపై సాధించిన ప్రభావం వంటి అంశాల ఆధారంగా ఆమోదిస్తారని తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న రావూస్ పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు

కరీంనగర్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్‌నగర్ రావూస్ ఇం టర్నేషనల్ పాఠశాలలో క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ప్రపంచ క్యాన్సర్ అవేర్‌నెస్ డేను పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులు ప్లకార్డులతో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రస్తుత నాగరీకరణతో మనం తీసుకునే ఆహారంపైన మన ఆరోగ్యం ఆధారపడి ఉందని, డబ్బు కన్నా ఆరోగ్యం ముఖ్యమని అన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేస్తూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని అన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల సీఈవో నితిన్‌రావు, ప్రిన్సిపాల్ రెహమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసక్తి చూపని పట్టభద్రులు

(5వ పేజీ తరువాయి)

వినియోగించుకునేందుకు ఓటరు నమోదు గడువును పెంచాలని పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులతోపాటు పట్టభద్రులు, టీచర్లు కోరుతున్నారు. ఓటరు నమోదుకు 36 రోజుల గడువు మాత్రమే ఇచ్చారని, మరికొంత సమయం ఇవ్వాలని ఎన్నికల కమిషన్‌ను విజ్ఞప్తి చేశారు. ప్రతిసారి ఎమ్మెల్సీ ఎన్నికలకు ముందు ఓటరు నమోదు చేయాలనే నిబంధనలను తొలగించి సాధారణ ఎన్నికల మాదిరిగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశంకల్పిస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 7:30గంటల నుంచి 11 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు, రూరల్, ఏడీఈలు, ఏం లావణ్య, జి, రఘులు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు ఆటోనగర్, బాలాజీ నగర్, గణేష్‌నగర్,తిరుమల నగర్, దోబీఘాట్, విశాల్, డీమార్ట్ ఏరియా, రూరల్ పరిధిలోని తీగలగుట్టపల్లి ఫీడర్ పరిదిలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయు ప్రాంతాలు సరస్వతినగర్, విద్యారణపురి, హనుమానగర్, మణికేశ్‌నగర్, వివిధ ప్రాంతలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వారు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో కోరా జాన్సన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కోరా జాన్సన్ యాజమాన్యం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్‌లో ఈనెల 3న జరిగిన హ్యాండ్‌బాల్ సబ్ జూనియర్స్ స్టేట్‌మీట్‌లో కరీంనగర్‌కు చెందిన కోరా పాఠశాల విద్యార్థులు యోగీశ్వరి కెప్టెన్సీలో శ్రీహిత, సాయిశరణ్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మూడో బహుమతి సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరిక్రిష్ణ, వంగల సంతోష్‌రెడ్డిలు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నామన్నారు. బహుమతి గెలుచుకున్న విద్యార్థులకు మెమెంటో అందించి అభినందించారు.

ఉజ్వల పార్కుకు 'వెలిచాల' పేరు పెట్టాలి

కరీంనగర్ అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఉజ్వల పార్కుకు ప్రముఖ తెలంగాణ ఉద్యమకారుడు, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావు పేరు పెట్టాలని కాంగ్రెస్ పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి సరిళ్ళ రతన్‌రాజు, నాయకులు గండి రాజేశ్వర్‌రావు, పలువురు నాయకులు గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కరీంనగర్ పరిధిలో జగపతిరావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం 20 గుంటల స్థలాన్ని కేటాయించాలని కోరారు. జగతిరావు రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పేదల సంక్షేమం కోసం పని చేశారని పేర్కొన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యేగా పని చేసిన సమయంలోనే జగపతిరావు మానేరు డ్యాం పక్కన ఉజ్వల పార్కును ఏర్పాటు చేయించారని అన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పరుగులు తీస్తున్న అభివృద్ధి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో రోల్ మోడల్‌గా నిలిచేలా పరిపాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం నిరంతరం పట్టుదలతో కృషి చేస్తున్నారని అన్నారు.

బీఆర్‌ఎస్ పాలకులు అప్పుల కుప్పగా మార్చిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి సంక్షేమంలో పలు సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. ప్రపంచంలోనే హైదరాబాద్ నగరాన్ని అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దేందుకు ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి కంకణ బద్ధులై సాగుతున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయంలో అధ్యయనోత్సవాలు ఆరంభం

కరీంనగర్ కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వావిలాలపల్లిలోని ప్రాచీన శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయరుస్వామి మంగళా శాసనములతో 27వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ద్రవిడ వేద ప్రబంధ పారాయణంతో అధ్యయనోత్సవం ప్రారంభమైంది. శుక్రవారం సాయంత్రం పరమపదోత్సవంతో అధ్యయనోత్సవం ముగియనుంది.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మేచినేని అశోక్‌రావు, కార్పొరేటర్ మేచినేని వనజ, పలువురు ఆలయ కమిటీ బాధ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. శనివారం ఉదయం 8గంటల నుంచి విశ్వక్సే నారాధన, బ్రహ్మకలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం నిత్య హవనం జరుగనుంది. సోమవారం వరకు ఉదయం సాయంత్రం జరిగే బ్రహ్మోత్సవ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తరించాలని నిర్వాహకులు కోరారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గంగాడి తిరుపతిరెడ్డి

వీణవంక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం గంగాడి తిరుపతిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మడుగురి సమ్మిరెడ్డి, గూటం సమ్మిరెడ్డి, మద్దుల సంపత్, రవి, సాయిలు, రైతులు రవి, సదయ్య, శ్రీనివాస్, భిక్షపతి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు'ను అడ్డుకున్నది కౌశిక్‌రెడ్డినే



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు దళితబంధు రెండో విడత డబ్బులు ఇస్తే ఓట్లు వేయరనే ఉద్దేశంతో అడ్డుకున్న వ్యక్తి కౌశిక్‌రెడ్డి అని, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో దళితబంధు డబ్బులను ఎందుకు ఇప్పించలేదని ప్రశ్నించారు. దళితబంధు రెండో విడత డబ్బులు ఇస్తే ఎన్నికల్లో ఓడి పోతాననే భయంతో అధికారులకు చెప్పి అడ్డుకున్నారన్నారు. దళిత బంధు డబ్బులు ఇప్పించే బాధ్యత కాంగ్రెస్ పార్టీదన్నారు. హుజూరాబాద్, జమ్మికుంట మున్సి పాలిటీలలో ప్రభుత్వ భూములను అక్రమించుకున్న బీఆర్‌ఎస్ నాయకులు చిట్టా తీస్తున్నామన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ వచ్చి న తర్వాత రూ. 10కోట్ల అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. కౌశిక్‌రెడ్డి కాంగ్రెస్ నాయకుల జోలికి వస్తే కార్యకర్తలు గ్రామాల్లో తిరగనివ్వరన్నారు. సమావే శంలో సొల్లు బాబు, పుష్పలత, దేశిని కోటి, కొలిపాక శంకర్, ఎర్రబెల్లి రాజేశ్వ ర్‌రావు, మేకల తిరుపతి, చరణ్ పటేల్, అప్సర్, తౌసీఫ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

'దళితులపై కౌశిక్‌రెడ్డిది కపట ప్రేమ'

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దళితులపై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిది కపట ప్రేమ అని టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దళితబంధు నిధులను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో ఎందుకు ఇప్పించలేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే గా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడకుండా కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ అందజేత



పరీక్షప్యాడ్‌లను అందిస్తున్న ట్రస్టు సభ్యులు

కరీంనగర్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లను గురువారం ట్రస్టు చైర్మన్ జగదీశ్వర్ అందజేశారు. కార్యక్రమంలో దుర్శేడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గౌరవిస్తాం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్(మానకొండూర్), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధనలో ముఖ్య భూమిక పోషించిన ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి గౌరవస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎల్ఎండీ క్యాంపు కార్యాలయంలో ఈ నెల 27, 28తేదీల్లో ఉద్యమకారుల ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అమరవీరుల స్థూపం నుంచి వేములవాడ వరకే చేపట్టే మహాపాదయాత్ర పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తన రాజకీయ అవసరాల కోసం వాడుకొని వదిలేసిందన్నారు. తెలంగాణ సాధనలో ముఖ్య భూమిక పోషించిన ఉద్యమకారులను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి సముచితరీతిలో గౌరవిస్తుందన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. భవిష్యత్తులో వారికి అండగా ఉంటుందని తెలిపా రు. కరీంనగర్ నుంచి వేములవాడకు చేపట్టిన మహాపాద యాత్ర విజయవంతం చేయాలని కోరారు కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి, రాష్ట్ర మహిళా నాయకురాలు ఐల ప్రసన్న, కంజర్ల రేణుక, భార్గవి, దేవునూరి అంకూస్, సంజీవ్, చంద్రమౌళి, సదానందం, విద్యాసాగర్, శంకర్, మొగిలి, సుధాకర్, తార, వెంకటి పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఓటర్ జాబితాపై ఆర్డీవో సమీక్ష

హుజూరాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ కేసీ క్యాంపులోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఓటర్ జాబితా పై వివిధ పార్టీ నాయకులతో ఆర్డీవో రమేశ్ బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు తూర్పాటి రాజు, కాంగ్రెస్ నాయకుడు సొల్లు బాబు, టీడీపీ నాయకుడు రాజేశం పాల్గొన్నారు.

ప్రహరీ పనులకు భూమి పూజ

జమ్మికుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఖాళీ స్థలంలో ఎనిమిది లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న ప్రహరీ గోడ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబుకు కౌన్సిలర్ నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ పనులకు..

గన్నేరువరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఖాసింపేట మానసాదేవి ఆలయం వద్ద సెంట్రల్ లైటింగ్ కోసం సుడా నుంచి 16 లక్షల నిధులు మంజూరు కావడంతో గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు భూమి పూజను చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సం యుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, మం డల వర్కింగ్ ప్రెసిడెంట్ పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

క్రాకర్స్ విక్రయదారుల పట్టణ కమిటీ

జమ్మికుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణ క్రాకర్స్ విక్రయదారుల కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోళ్ల కార్తీక్, ఉపాధ్యక్షుడిగా శివన్న, సెక్రటరీగా చొక్కారపు అఖిలేష్, జనరల్ సెక్రటరీగా దొడ్డె రమేశ్ ఎన్నికయ్యారు.

రైతులకు పరిహారం అందజేస్తాం : ఆర్డీవో రమేశ్‌బాబు

శంకరపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందజేస్తామని ఆర్డీవో రమేశ్ బాబు శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో నేషనల్ హైవే-563 విస్తరణ పనుల్లో భూమి కోల్పోయి పరిహారం అందని రైతులతో ఆర్డీవో రమేశ్‌బాబు డీఐతో కలిసి మాట్లాడారు. కొత్తగట్టు గ్రామానికి చెందిన 15 మంది రైతులకు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భూములు కోల్పోయిన పరిహారం అందకపోవడంతో ఫిర్యాదు చేశారు. ఆర్డీవో రమేశ్, డీఐలు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిహారం అందని రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ భాస్కర్, ఆర్ఐ బాల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు బానిస కావద్దు

హుజూరాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. హుజూరాబాద్ మండలంలోని రాంపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు గురువారం మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన జీవితాన్ని నిర్మించుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ వినోద్‌కుమార్, హెచ్‌సీ ముకుందారెడ్డి, కానిస్టేబుళ్లు సంతోష్, రాజశేఖర్, హెచ్ఎంలు సమ్మిరెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని స్రవంతి జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వల్ల తలెత్తే అనార్థాలపై విద్యార్థులకు ఎక్సైజ్ సీఐ మాధవిలత అవగాహన కల్పించారు. యువత చదువుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు అభివృద్ధి చేతకాదు'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నాయకులకు అభివృద్ధి చేయడం చేతకాదని బీజేపీ నాయకులు అన్నారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట గుండ్ల చెరువును గురువారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గుండ్ల చెరువుకు గండి పడి ఏడాది కావస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. ఏపార్టీకి పట్టడం లేదన్నారు. ఇలాంటి నాయకులు అభివృద్ధి చేశామని చెప్పుకోవడం సిగ్గు చేటని విమర్శించారు. కార్యక్రమంలో మల్లేష్, ఆకుల రాజేందర్, కొమ్ము అశోక్, కైలాసకోటి గణేష్, బచ్చు శివన్న, స్వరూప, రవిచంద్రారెడ్డి, రాము, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

గన్నేరువరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వారి తల్లిదండ్రుల పేరున మొక్కలను నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని తహసీల్దారు ఇప్ప నరేందర్ అన్నారు. నెహ్రూ యువ కేంద్ర కరీంనగర్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు.

హుజూరాబాద్ రూరల్: హుజూరాబాద్ కేసీ క్యాంపులోని న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం ఏక్ పెడ్ మా కే నామ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో యుశక్తి యూత్ అసోసియేషన్ రాజపల్లి సభ్యులు మొక్కలు నాటారు.

ట్రైనీ కలెక్టర్ పరిశీలన

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామంలో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్ గురువారం పరిశీలించారు. జాతీయ పశుగణన కార్యక్రమం పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్, మండల పశువైద్యులు సుష్మితారెడ్డి, అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గన్నేరువరం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విదార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సీసీ రోడ్డు నిర్మించాలి

గన్నేరువరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చీమలకుంటపల్లి గ్రామంలో దళితవాడల్లో సీసీ రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యారాయణకు కాలనీవాసులు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రవిందర్, ఆంజనేయులు, రమేశ్ పాల్గొన్నారు.

'కౌశిక్‌రెడ్డిని విమర్శిస్తే సహించం'

జమ్మికుంట రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని విమర్శిస్తే సహించబోమని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పర్లపల్లి రమేశ్ అన్నారు. పట్టణంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరిస్తుంటే కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు మంద రాజేష్, వేల్పుల శ్రీకాంత్, ఎలుకపల్లి రాజేష్, మల్లిఖార్జున్ పాల్గొన్నారు.